www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024
5
అన్నమయ్య



## సిజిఆర్ టాలెంట్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సిజిఆర్ టాలెంట్ మీట్-24 పోస్టర్‌ను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిజిఆర్ టాలెంట్ మీట్‌లో టెక్నికల్ సింపోజియం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, కల్చర్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ అనే అంశాలు కలవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 3, 4వ తేదీలలో జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో వ్యక్తిగత నైపుణ్యం పెరుగుతుందని, అన్ని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ ఒ.హేమకేశవులు, అసోసియేట్ ప్రొఫెసర్, ఇఇఇ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ అధికారి నూకా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

# కడప ఎంపీ బరిలో షర్మిల!?



కడప పార్లమెంట్ బరిలో వైఎస్ షర్మిల నిలిచే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 25న తొలి విడత టికెట్ల విడుదల నాటికి స్పష్టత రానుంది. కాంగ్రెస్ అధిష్టానం సైతం ఆదేశించినట్లు సమాచారం. షర్మిల సంసిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈమె పోటీ చేయనుండడంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా నిలిచిన మైనార్టీలు వైసిపి మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. రెండు నెలల కిందటి నుంచి పలువురు ముస్లిమ్ ప్రముఖులు వైసిపి, టిడిపి, జనసేన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్లు వేస్తే బిజెపికి వేసినట్లే అవుతోందని, ఇండియా బ్లాక్‌కు ఓట్లేస్తే ఓటింగ్ శాతం పెరగడం ద్వారా అధికార, ప్రతిపక్ష పార్టీలకు కనువిప్పు కలిగించినట్లు అవుతుందనే ఉద్దేశంతో చాపకింద నీరులా పనిచేస్తున్నారు.

- మూడ్రోజుల్లో స్పష్టతకు అవకాశం
- వైసిపి, టిడిపిలో అలజడి
- మైనార్టీ ఓట్లపై ఆశలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కడప పార్లమెంట్ ఎన్నిక ఉత్కంఠను కలిగిస్తోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీల పరిధిలో 16.16 లక్షల ఓటర్లు ఉన్నారు. వీరి ఓట్లను గణనీయమైన సంఖ్యలో కైవసం చేసుకునేందుకు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థుల పోరాటం ఆసక్తికరంగా మారింది. అధికార వైసిపి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. ప్రతిపక్ష టిడిపి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై నిమగ్నమైంది. కాంగ్రెస్ తరుపున షర్మిల నిలవనుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. కేంద్రంలో బిజెపి సర్కారు సిఎఎ గ్రిడ్ లెన్స్ అమలు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఓటు బ్యాంకును రాబట్టుకోవడంపై దృష్టి సారించింది. ముస్లిమ్‌లు, క్రిస్టియన్ల ఓట్లపై వల వేసినట్లు కనిపిస్తోంది. సంప్రదాయ కాంగ్రెస్ ఓట్లు, మైనార్టీ ఓట్లలో చీలిక ద్వారా ఓటు శాతాన్ని గణనీయంగా పెంచుకోవడంపై దృష్టి సారించింది.

**సానుభూతి ఓట్లపై కన్ను!**

మాజీ మంత్రి వైఎస్ వివేకా అభిమానుల సానుభూతి ఓట్ల ప్రభావం చూపే అవకాశం ఉంది. వైఎస్ వివేకా వర్గంలో సభకు హాజరైన నేతలు, అభిమానులు బలం చేకూరుస్తోంది. వివేకా హత్య ఘటనపై ముఖ్యమంత్రి హోదాలో ఉన్న సహోదరుడు వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించడం, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై సెంటిమెంట్ రాజేయడం, ఆమె సోదరి సునీత హత్య రాజకీయాలకు పాల్పడుతున్న వైసిపికి ఓట్లేయొద్దని విజ్ఞప్తులు చేసిన నేపథ్యం పార్లమెంట్ ఎన్నిక ఉత్కంఠను కలిగిస్తోంది. వివేకా కుటుంబం సైతం తన వెంట నిలబడి ప్రచారం చేయనున్న నేపథ్యంలో వైసిపి నుంచి సానుభూతి ఓట్లను కొల్లగొట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**మైనార్టీ ఓట్ల చీలికపై ఆశలు!**

జిల్లాలో మైనార్టీ ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. కడప అసెంబ్లీలో 90 వేలు, కమలాపురంలో 75 వేలు, మైదుకూరులో 30 వేలు, ప్రొద్దుటూరులో 55 వేలు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలులో 30 వేలు చొప్పున ముస్లిమ్ ఓటర్లు ఉన్నట్లు ఓ అంచనా. గణనీయమైన సంఖ్యలో క్రిస్టియన్ ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ బరిలో షర్మిల నిలబడితే ముస్లిమ్, క్రిస్టియన్ ఓటర్లపై ఆశలు పెంచుకున్నట్లు తెలుస్తోంది. రెండు శాతం నుంచి నాలుగు శాతానికిపైగా ఓట్లు చీలితే వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల తలరాతలు మారే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనప్పటికీ పదేళ్ల కిందటి తరహా రాజకీయ వాతావరణం నెలకొనే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

# దోచుకోవడమే వైసిపి నేతల నైజం

**- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి**



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న భువనేశ్వరి, అక్కమ్మ కుటుంబ సభ్యులకు చెక్ ఇస్తున్న భువనేశ్వరి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

వైసిపి ప్రభుత్వంలో ఎక్కడ ఏమి కనిపించినా దోచుకోవడం, దాచుకోవడమే ఆ పార్టీ నాయకుల నైజమని టిడిపి అధినేత నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లా బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల గ్రామంలో పార్టీ కార్యకర్త మెహబూబ్‌చాంద్, బలిజపేటలో మస్తె అక్కమ్మ కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక వారు గుండెపోటుతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు ఆమె నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం కింద చెక్కులు అందజేశారు. పరామర్శల అనంతరం పోరుమామిళ్ల ప్రజలతో భువనేశ్వరి మాట్లాడుతూ ప్రతి రోజూ మీ పొలాలు, స్థలాలు ఉన్నాయో లేదో చూసుకోవాల్సొస్తోందన్నారు. వైసిపి నేతలకు ఏది కనిపించినా దోచేస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన మొత్తం దోపిడీ పర్వంగా కొనసాగిందే తప్ప, సామాన్యులకు లాభకరమైన పనులేవీ ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు. వైసిపి పాలనలో కల్తీమద్యం, ఇసుక దోపిడీ, భూకబ్జాలు, గంజాయి, డ్రగ్స్, మహిళలపై దాడుల్లో ఏపిని భారతదేశంలోనే జగన్మోహన్‌రెడ్డి మొదటి స్థానంలో నిలబెట్టారన్నారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపిని నిలబెట్టారని తెలిపారు. వైసిపి పాలనలో టిడిపి ప్రభుత్వం తెచ్చిన కంపెనీలన్నీ ప్రస్తుతం రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. ఏపికి రాజధాని లేకుండా చేసి రాష్ట్రం పరువు తీశారన్నారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలని తెలిపారు. దీనికి ప్రతి కార్యకర్త, నాయకుడు సంసిద్ధంగా ఉండాలన్నారు. వైసిపి చేసే అరాచకాలను ధైర్యంగా తిప్పికొట్టి, 2024 ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో దుర్మార్గపు పాలనకు అంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు, భావితరాల భవిష్యత్తు బాగుంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తారని తెలిపారు. సంక్షేమంతో పాటు భవిష్యత్తు కూడా గ్యారంటీ ఉంటుందని విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కడప టిడిపి అభ్యర్థి మాధవి, యువ నాయకులు రితీష్‌రెడ్డి పాల్గొన్నారు.

**అక్రమ కేసులకు భయపడవద్దు**

రైల్వేకోడూరు: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడవద్దని కార్యకర్తలకు అండగా ఉంటామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి బద్వేల్ నుంచి వెళుతూ మార్గమధ్యలో పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు, మాదినేని విశ్వేశ్వర నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులను కలిశారు. ముక్కావారిపల్లె వద్ద టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మి భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. రూపానందరెడ్డి ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి 53 రోజులు జైలులో ఉంచారని తెలిపారు. అక్రమ అరెస్టును జీర్ణించుకోలేని కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురై మృతి చెందారని చెప్పారు. అలాంటి వారి కుటుంబాలను తాను పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పిస్తున్నానన్నారు. అనంతరం రూపానందరెడ్డి నివాసంలో భువనేశ్వరి బృందానికి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.కె.చౌదరి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి, సర్వంట్ అరవ శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నారా భువనేశ్వరికి వెంకటరాజంపేట వద్ద టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : జెసి


మాట్లాడుతున్న పీలేరు ఆర్ఒ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ప్రతిపాదించిన నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించి వాటిని అనుసరించి తీరాలని పీలేరు నియోజకవర్గం ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు అన్ని రాజకీయ పార్టీలు సమానమే అని, ఎన్నికలకు సంబంధించిన ఏ పని చేయాలన్నా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించి ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారాలకు, కార్యాలయాల ఏర్పాటుకు, వాహనాల వినియోగానికి అనుమతుల కోసం సువిధ యాప్ అందుబాటులో ఉందని, రాజకీయ కార్యక్రమాలకు 48 గంటల ముందు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి 24 గంటల్లోగా అనుమతులు లభిస్తాయని చెప్పారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘించే వారిపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. ఫిర్యాదులు అందిన 100 నిమిషాల్లోగా వారిపై సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆయన సి-విజిల్ యాప్ పని విధానాన్ని వివరించారు. సమావేశంలో ఇఆర్ఒ రామ, పీలేరు నియోజకవర్గ పరిధిలోని గుర్రంకొండ, కలకడ, వాల్మీకిపురం, కలికిరి, కెవి పల్లి, పీలేరు మండలాల తహశీల్దారులు శ్రీనాథ్, ప్రియదర్శిని, ఖతిజున్ కుబ్రా, విజయ కుమారి, ప్రియదర్శిని, నయాజ్ అహ్మద్, మహబూబ్ బాష, వైసిపి, టిడిపి, జనసేన, సిపిఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 17 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాల్లో విసికె పోటీ

**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్**

ప్రజాశక్తి-మదనపల్లి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికల్లో 17 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు విసికె పార్టీ అభ్యర్థులు సంసిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మదనపల్లె, రాయచోటి, కుప్పం, పలమనేరు, నగిరి, సత్యవేడు, చంద్రగిరి, కళ్యాణదుర్గం, బాపట్ల, వేమూరు, తెనాలి, అమలాపురం, మండిపేట, చిలకలూరిపేట, సూళ్లూరుపేట, నందిగామ, నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల తోపాటు రాజంపేట, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విసికె పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్నందున తమ పార్టీ పోటీ చేయదలచిన 17 అసెంబ్లీ, 4 పార్లమెంట్ నియోజకవర్గాల జాబితాను జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్ ద్వారా ఎపి కాంగ్రెస్ చీఫ్ వై.ఎస్.షర్మిలకు అందజేశారని తెలిపారు. దీనిపై స్పష్టత రావాల్సివుందన్నారు. సీట్లపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇచ్చిన వెంటనే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కుదరక పోతే తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా కలిసి పనిచేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. బిజెపిని దానికి సహకరించే టిడిపి, జనసేన, వైసిపిలను ఘోరంగా ఓడించి, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎంపీ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లెకు వాటర్ గ్రిడ్ తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం మదనపల్లె జెసిఎం కమ్యూనిటీ హాల్లో బార్ అసోసియేషన్, ఇంజినీర్స్, ప్లానర్ అసోసియేషన్, డాక్టర్స్ అసోసియేషన్ తదితరులతో వైసిపి ఐదేళ్ల పాలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు ఔటర్ రింగు రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా లేని లోటును తీర్చడానికి పరిశ్రమలు, బిటి కాలేజీని యూనివర్సిటీ చేసి ఎడుకేషన్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. మరొక్క సారి అవకాశం ఇచ్చి ఎంపీగా తనను ఎమ్మెల్యేగా నిస్సార్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, ఎపిఎండిసి చైర్‌పర్సన్ షమీం అస్లాం, పలమనేరు ఎమ్మెల్యే వెంకట్‌గౌడ, ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి పాల్గొన్నారు.

## ఎంసిసిని అనుసరించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి తెలిపారు. గురువారం పీలేరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒ, గ్రామ సచివాలయం సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎవరూ అతిక్రమించకూడదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ 24×7 విధుల్లో ఉండాలని తెలియజేశారు. ఎంసిసి విధి విధానాలను చదివి వినిపించి, తగు సూచనలు ఆదేశాలిచ్చారు. ఎవరూ కూడా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఎంసిసిపై అవగాహన కల్పిస్తున్న ఉపేంద్రారెడ్డి

## అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - రాయచోటి :** అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఫైర్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఆవహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఇతరులను ఏ విధంగా కాపాడాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఎజిఎం శంకర్‌రెడ్డి మాట్లుడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో ఆత్మ ధైర్యాన్ని నింపుతుందన్నారు పాఠశాల ప్రిన్సిపల్ ఖదర్ వల్లి మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలు విద్యార్థులకు అకడమిక్స్‌తో పాటు అనేక విషయాలపై అవగాహన కల్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎఇ నరసింహులు, అకడమిక్ డీన్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాళ్లు సుగుణవేణి, నందిని, అకడమిక్ కో-ఆర్డినేటర్స్ సంపత్, జెరూషా, భానుశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజా శక్తి రాయచోటి

మానవులకు, జంతువులకు అన్ని విధాల ఉపయోగపడే అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అడవుల సంరక్షణ పై గురువారం ఉదయం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు పక్షులు, జంతువులకు నివాసాలు మాత్రమే కాకుండా అవి సమీపంలో నివసించే ప్రజలకు జీవనాధారంగా కూడా ఉపయోగ పడుతున్నాయన్నారు. అడవులు ఎక్కువగా ఉంటే వర్షాలు విస్తారంగా కురుస్తాయన్నారు. మానవులు బతకడానికి అవసరమైన ఆక్సిజన్ అడవుల నుంచి ఉచితంగా లభిస్తుందన్నారు. చెట్లను నరకడం వల్ల భూగోళం వేడెక్కుతుందన్నారు. ఫలితంగా మంచు పర్వతాలు కరిగి సముద్ర తీర ప్రాంతంలోని అనేక నగరాలు మునిగిపోతాయని చెప్పారు. అడవుల ప్రాముఖ్యంపై ప్రజలందరికీ అవగాహన కలగజేయడం ఎంతో అవసరం అన్నారు. అనంతరం అడవుల సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు తీసుకుంటున్న విద్యార్థులు

## సింపోజియంలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ విద్యార్థులు కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియంలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న ఇంద్ర కుమార్, మాధవరావు క్రాప్ రెకమెండేషన్ బేస్డ్ ఆన్‌ఎన్‌పికె వాల్యూస్ యూసింగ్ ర్యాండమ్ ఫారెస్ట్ అను అంశంను పరిశోధన పత్ర పోటీలలో ప్రదర్శించి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రం, షీల్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, తదితరులు అభినందనలు తెలియాజేశారు.

# పిఎఫ్ సొమ్ము జమ చేయాలి : సిఐటియు


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికుల పిఎఫ్ సొమ్ము మొత్తం వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యం చెన్నయ్య అధ్యక్షతన మున్సిపల్ యూనియన్ పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కార్మికులు నిత్యం శ్రమించి తన జీతంలో కొంత సొమ్మును భవిష్య నిధి భద్రపరచు కుంటే పిఎఫ్ ఖాతాకు జమ చేయకుండా వారి సొమ్మును ప్రభుత్వం స్వాహా చేయడానికి అధికారులు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి అధికారులను సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. 2014 నుంచి నేటి వరకు 3 ఖాతాలుగా పిఎఫ్‌ను విభజించి దోచుకున్నారని ఆరోపించారు. గత కలెక్టర్ చర్యలతో ఒక ఖాతాగా సరిచేసినట్టే చేసి తప్పుకున్నారని విమర్శించారు. పిఎఫ్ సొమ్ము మీద ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేనందున వచ్చే ఎన్నికల్లో పాలకులకు గట్టి బుద్ధి చెబుతామని మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు యం. చెన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో అగ్గరామయ్య, శంకరయ్య, తిరుపాల్, మంగమ్మ ,తిరపతమ్మ, సుభాషిణి, ఉమా మహేశ్వరీ, రమణమ్మ, సురేష్, సిద్దయ్య, చిన్న వెంకటరమణ పాల్గొన్నారు.

# అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా : డిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

ఇందిరమ్మ అభయం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా నినాదాలనే కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రాలుగా మార్చుకుని ప్రతి మండల అధ్యక్షుడు సైనికుడిలా మారి రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిని చేయడానికి కృషి చేయాలని డిసిసి అధ్యక్షుడు షేక్. అల్లాబకష్ అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.షర్మిల ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షుడు జిల్లాలోని 30 మండలాలకు, రాయచోటి ఖాదర్‌ఖాన్, మదనపల్లి రెడ్డి సాహెబ్, రాజంపేట నరేష్‌ను పట్టణ అధ్యక్షులుగా నియమిస్తూ వారికి గురువారం డిసిసి కార్యాలయంలో నియామక పాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడూ న్యాయం పొందే వరకు న్యాయం కోసం పోరాడాలని అన్నారు.అనంతరం సమావేశంలో అన్నమయ్య డిసిసి మహిళా అధ్యక్షురాలు గోసాల దేవి, మదనపల్లి మదనపల్లి నియోజకవర్గం నియోజవర్గం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్ రెడ్డి సాహెబ్ రెడ్డి సాహెబ దేశానికి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ శాంతయ్య, పాల్గొన్నారు.


మండలాలకు నియమితులైన అధ్యక్షులతో నాయకులు


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం, విద్యార్థులు

## దంత రక్షణపై శ్రద్ధ చూపాలి

**ప్రజాశక్తి-పీలేరు :** దంత రక్షణ, నోటి శుభ్రతతో ఆరోగ్య సమస్యలను అధికమించవచ్చని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తలుపుల ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దంత రక్షణ, నోటి శుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకి రెండు సార్లు దంతాలు శుభ్రం చేసుకోవాన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలని తెలిపారు. అవసరమైనప్పుడు తక్షణం డాక్టరును సంప్రదించాలన్నారు. నోరు, దంతాలు, చిగుళ్లు, దంతక్షయ, చిగుళ్ళవాపు మొదలగు సమస్యలే కాకుండా నివారణ లేని కొన్ని రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మంచి ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలితో దంత, నోటి ఆరోగ్య సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. అనంతరం పిల్లలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఉపాధ్యాయులు సిద్ధరాజ, నజీర్, ఎఎన్ఎం నాగవేణి, సిహెచ్ఒ కుముద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**రంజాన్ వేళలు**



| ఇఫ్తార్ | షహారీ |
|---|---|
| శుక్రవారం (సా) | శనివారం (ఉ) |
| 6.30 | 5.03 |


రోగులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

## రంగప్పగారిపల్లెలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కలకడ**

మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ రంగప్పగారిపల్లెలో ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, అసంక్రమణ వ్యాధులు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధులకు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. జనరల ఒపి 135 మంది హాజయ్యారని చెప్పారు.ఆస్పత్రికి రాలేని గర్భిణులకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. ప్రతి గృహంలో జ్వరం, దగ్గు, జలుబు, పరిసరాల పరిశుభ్రత, లార్వా సర్వేలు నిర్వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింత సంరక్షణ వ్యాక్సినేషన్ టీకాల కార్యక్రమాన్ని నూరు శాతం సాధించాలని ఆదేశించారు. వేసవికాలంలో వచ్చే డయేరియా, వడదెబ్బకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అప్రమత్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులను ఎండకు బయటకు పంపకుండా జాగ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఒఆర్ఎస్ వైద్య శిబిరాల్లో పెట్టాలని, వడదెబ్బకు కావలసిన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి. జయరామయ్య , ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిబి అశ్వని, డేటాఎంట్రీ ఎ.రోజా ఫైలెట్ రమేష్‌బాబు, ఆశా కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న పంచాయతీ సిబ్బంది

## ఓటు హక్కుపై అవగాహన

**ప్రజాశక్తి-రామపురం**

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సరస్వతిపల్లి పంచాయతీ సెక్రెటరీ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామపంచాయతీలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఓటు హక్కుపై ప్రజలకు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ హేమలత, విఎఎ మురళీధర్, మహిళా కానిస్టేబుల్ మౌనిక పాల్గొన్నారు.


సుగవాసి ప్రసాద్‌బాబుతో మండల టిడిపి నాయకులు

## 'సుగవాసి'ని కలిసిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-గాలివీడు**

తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్య నిర్వాహక కార్యదర్శిగా నూతనంగా ఎన్నికయిన సందర్భంగా టిడిపి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబును గురువారం మండల టిడిపి నాయకులు కలిసి దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సుగవాసిని కలిసిన వారిలో కొంగ వెంకటేశ్వర్లు, గూడుపల్లి కరుణాకర్‌రెడ్డి, గాండ్లపల్లి శివ, మండెం శివశంకర్, పశువులేటి సత్యనారాయణ, మురుగు నాగేశ్వరరావు నాయుడు, నరసింహ నాయుడు, దేవపట్ల జనార్దన్, రామాంజులు నాయుడు, అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు మల్లికార్జునలు ఉన్నారు.

## ముగ్గురిపై బైండోవర్ కేసు నమోదు

**ప్రజాశక్తి-గాలివీడు**

మండల కేంద్రాన్ని చెందిన టిడిపి, వైసిపి పార్టీలు చెందిన ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో అనేకమంది టిడిపి, వైసిపి నాయకులే కాకుండా రౌడీషీటర్లు కూడా ఉన్నారని, వీరందరిని ఎన్నికల నియమాలు అనుసరించి బైండోర్ కింద అరెస్టు చేసి తహశీల్దార్ దగ్గరకు పంపుతున్నట్లు చెప్పారు.

## కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక కెజిబివిలో జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో చేరేందుకు విద్యార్థినిలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కెజిబివి స్పెషల్ ఆఫీసర్ నీరజ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి, ఎంపిసిపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతమైన విద్య అందుతుందని అన్నారు. విద్యాభ్యాసం, భోజన వసతి అన్ని సదుపాయాలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 31న ఐడిపిఎస్‌లో చిత్రలేఖన పోటీలు

**ప్రజాశక్తి - చాపాడు**

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 31న చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మూడు విభాగాలలో నిర్వహించనున్నట్లు, ప్రతి విభాగంలో విజేతలైన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు. సీనియర్ విభాగంలో 7,8,9 తరగతులు పాల్గొంటాయని, విజేతలకు మొదటి బహుమతి రూ.7వేలు, రెండవ బహుమతి రూ. 50వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు జూనియర్స్ విభాగంలో 4,5,6 తరగతులు ఉంటాయని, గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.1,500 అందజేస్తామని తెలిపారు.



# కేంద్ర బలగాలతో తనిఖీలు ముమ్మరం


గ్రామంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

నగర పంచాయతీ పరిధిలోని దేగానిపల్లిలో గురువారం సిఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అనం తరం గ్రామంలో పోలీసులతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనుమానం వచ్చిన వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు.వాహనాలను తనిఖీలు చేసి రికార్డులు సక్రమంగా లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు కేంద్ర బలగాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతమైన పల్లెల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎఎస్ఐ బొజ్జ నాయక్, హెడ్ కానిస్టేబుల్ మారుతి ప్రసాద్ రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు గౌడ్, రమణ, లక్ష్మీనా రాయణ, నాగేంద్ర, హోంగార్డు అంబరీష్ పాల్గొన్నారు.

### - ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి

**నందలూరు :** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రచెరువుపల్లి, చెన్నయ్యగారిపల్లిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ప్రజలలో ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడం కోసం కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించామన్నారు. రాజ్యాంగం అందించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీసు వారు ప్రజలకు అండగా ఉంటారని ప్రజలు ఎటువంటి అపోహలకు గురికా వద్దని ప్రజలందరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ ధనుంజయ రెడ్డి, కానిస్టేబుల్ రవితేజ పాల్గొన్నారు.


ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించిన ఎస్ఐ అబ్దుల్‌జహీర్

## పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించాలి : ఎస్ఐ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, ఎంఇఒలు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

సార్వత్రిక ఎన్నికల్లో జరగనున్న పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలను మెరుగు పరచాలని ఎస్ఐ లోకేష్‌రెడి, సెక్టార్ అధికారి ఎంఇఒ పద్మావతి పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి, తవళం, కొండయ్యగారిపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను రిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవళం, అడుసుపల్లి, నిమ్మనపల్లి, వెంకోజిగారి పల్లి, కొండయ్యగారి పల్లిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులతో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సదుపాయం, బాత్ రూములు, మొదలగు సౌకర్యా లను పరిశీలించామని, బాత్ రూముల సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించినట్లు పేర్కొన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రస్తుతం అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జిలాని బాషా, బిఎల్ఒలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడిలో సేంద్రియ వ్యవసాయంపై ప్రదర్శన

**ప్రజాశక్తి-కలికిరి**

మామిడిలో సేంద్రియ వ్యవసాయంపై ప్రదర్శన నిర్వహించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి శాస్త్రవేత్త డాక్టర్. వై. పీరు సాహెబ్ తెలిపారు. గురువారం సదుం మండలం చింతమాకుల పల్లి గ్రామంలో మామిడిలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ప్రదర్శనను నిర్వహించారు. ఫ్రూట్ కవర్లు, పండు ఈగ బుట్టల ప్రాముఖ్యతను వివరించారు. పండు ఈగ బుట్టలు అమర్చడం,బెనిషా రకాలకు ఫ్రూట్ కవర్లు ఎలా కట్టాలో అవగాహన కల్పించారు.ఫ్రూట్ కవర్లు మామిడి కాయ కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు ఎటువంటి పురుగు తెగుళ్ల ఆశించని కాయను ఎంచుకొని వాటికి ఫ్రూట్ కవర్లు కట్టడం ద్వారా పండు ఈగ, మసిమంగు, తెగులు కాయ, తొలుచు పురుగు, ఇతర కీటకాలు తెగుళ్ల నుంచి రక్షణ పొందుతుందని అన్నారు. ఫ్రూట్ కవర్లు కట్టిన కాయలు మంచి సైజు, నాణ్యంగా ఉండడం వలన మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముడు అవుతున్నాయని అన్నారు. రైతులు ఫ్రూట్ కవర్లు వాడి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.



ఫ్రూట్ కవర్ల వినియోగంపై రైతులు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## గ్రామ కంఠం భూమిని కాపాడాలని వినతి

### - తహశీల్దార్‌కు దలవాయపల్లి గ్రామస్తుల ఫిర్యాదు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

తమ గ్రామంలోని గ్రామ కంఠం భూమిని కాపాడాలంటూ పుల్లంపేట మండలం దలవాయిపల్లి గ్రామ ప్రజలు గురువారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తమ గ్రామంలో శ్రీరాముల గుడి ముందు గ్రామ కంఠం ఉందని చెప్పారు. ఆ స్థలాన్ని ఆలయ ఉత్సవాలకు వినియోగించుకుంటూ ఉండే వారమని చెప్పారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమిలో రాళ్ల నాటి కంచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎంత చెప్పినా వారు వినక పోవడంతో తహశీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గ్రామకంఠం భూమిని దేవాలయానికి కేటాయిస్తే, భవిష్యత్తులో ఉత్సవాలు జరుపుకునేందుకు వీలుగా ఉంటుందని, గ్రామ కంఠం ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై స్పందించిన తహశీల్దార్ వెంకటనారాయణ మాట్లాడుతూ గ్రామకంఠ భూమి చుట్టూ హద్దులు వేసిన వ్యక్తుల వద్ద ఏమి ఆధారాలు ఉన్నాయో తీసుకురావాలని, విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాశక్తి-నందలూరు**

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ సుజామణి అన్నారు. గురువారం నందలూరు అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ రాణి ఆధ్వర్యంలో పోషణ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజామణి మాట్లాడుతూ మనం నిత్యం తీసుకొనే ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు తప్పనిసరిగా తీసుకుంటే ఆ పౌష్టి కాహారం వల్ల తల్లీ బిడ్డలు అనారోగ్యంగా ఉంటారని అన్నారు. గర్భిణులు, యుక్త వయస్సు బాలికలు కూడా నిత్యం ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినడం వల్ల రక్త ప్రసరణ బాగా జరిగి ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. పౌష్టికాహార లోప రహిత గ్రామాలుగా మారడానికి ఆ గ్రామం లోని ప్రజాప్ర తినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు సమన్వయంతో అవ గాహన కార్యక్రమాలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, హెల్త్ సూపర్వైజర్, మహిళా కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్


శ్రీకాంత్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం :'గడికోట'

**ప్రజాశక్తి-రాయచోటి**

నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లె మండలం గురిగింజకుంట గ్రామంలో డిసి ఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయ కులు గొర్ల రమేష్‌రెడ్డి, సర్పంచ్ రఘునాథ రెడ్డి, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, అన్నారెడ్డి తదితర నాయకులతో కలసి ఎన్నికల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిన్నపాపిరెడ్డిగారిపల్లె, దిన్నెపల్లె, మల్లూరు వాండ్లపల్లె, నాయునివారిపల్లె, , దళితవాడ, మొట్టముక్రిందపల్లె, యర్రకాల్వ వాండ్లపల్లె, నల్లకాల్వ వాండ్లపల్లెలలో ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి, జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి ,సంక్షేమాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

## మెస్ ఛార్జీలను విడుదల చేయాలి

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మో టిక్స్ ఛార్జీలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమ అధికారి నరసయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఎఐఎస్‌బి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ప్రచార సమయంలో సంక్షేమ వసతి గృహ విద్యా ర్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను పెంచుతామని సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీ, సంక్షేమ విద్యార్థులను గాలికి వదిలేసి తమది సంక్షేమ రాజ్యం అంటూ ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంక్షేమ అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న మెస్,కాస్మోటిక్స్ ఛార్జీలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓబయ్య, శ్రీనాథ్, గణేష్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన టిడిపి,జనసేన కూటమి నాయకులు

## వైసిపి పాలనకు చరమగీతం పాడుదాం

**ప్రజాశకి-పుల్లంపేట**

వైసిపి పాలనకు త్వరలో చరమగీతం పాడుదామని టిడిపి, జనసేన కూటమి నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రైల్వే కోడూరు నియోజవర్గంలో కూటమి అభ్యర్థి ఎవరైనా అందరం కలిసికట్టుగా అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, పార్టీ అధినేతల నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి నడుచుకోవాలని సూచించారు. సైకో పాలన పోవాలని కూటమి విజయం సాధించాలని తెలిపారు. వైసిపి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని అన్నారు. మరోసారి వైసిపికి అధికారం కట్టబెడితే రాష్ట్రం శ్రీలంక అవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి 'పెద్దిరెడ్డి'ని కలిసిన ఖలీల్ అహ్మద్

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం టి.సదుంలోని ఎర్రరాతివారిపల్లెలో మంత్రి సోదరుడు పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డిని టౌన్ కన్వీనర్ సి.ఆర్. చిన్నికృష్ణ, వైసిపి నాయకులు నరసింహనాయుడు, రఫీ, సాయిలతో కలిశామని చెప్పారు. నియోజ కవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వైసిపి గెలుపునకు చేపట్టాల్సిన కార్యచరణపై ఆయన సూచనలు చేశారని తెలిపారు.


ఖలీల్ అహ్మద్‌తో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

# క్రైం కార్నర్


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

## కర్ణాటక మద్యం తరలిస్తున్న నిందితులు అరెస్టు

**ప్రజాశక్తి-మదనపల్లి**

ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను మదనపల్లి తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అరెస్టుకు సంబంధించిన వివరాలను సిఐ ఎన్.శేఖర్, ఎస్ఐలు వెంకటేష్, రవికుమార్ వెల్లడించారు. మదనపల్లి మండలం చికిల బైలుకు చెందిన నరసింహులు కుమారుడు మండెం నవీన్ (29), గంగరాజు కుమారుడు నాగినేని శ్రీనివాసులు(30) కర్ణాటక రాష్ట్రం నుంచి ఏడు కేసుల కర్ణాటక మద్యాన్ని, ద్విచక్ర వాహనంలో తీసుకొని చీకలబైలుకు వస్తున్నట్లు మందస్తు సమాచారం అందిందని చెప్పారు. వెంటనే చీకలబైలు సరిహద్దు లోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌లో వస్తున్న మద్యం తరలిస్తున్న నిందితులు పట్టుబడ్డారని చెప్పారు. పట్టుబడిన వారి నుంచి కర్ణాటక మద్యం సీజ్ చేసి వారిని మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం అక్రమ మద్యం తరలింపు పై కేసు నమోదు చేసి అరెస్టు చేసామని సీఐ తెలిపారు. **బి.కొత్తకోట :** కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని దేగానిపల్లికి చెందిన గంగాధర్ కుమారుడు చంద్ర పృధ్విఅనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని తీసుకుని వచ్చి అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. దాడులు చేసి అతనిని వద్ద నుంచి డి.కె.డబుల్ కిక్ ఫైన్ విస్కీ కంపెనీకి చెందిన 90 ఎం.ఎల్ పరి మాణం కలిగిన 21 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## 40 మద్యం బాటిళ్లు స్వాధీనం

**కలకడ :** 40 మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మం డలం లోని బాలయ్య గారిపల్లి పంచా యతీ జరిగడ్డకు సమీ పంలో తన సిబ్బందితో వాహనాలు తనిఖీ నిర్వహించామని చెప్పారు. కె.వి పల్లి మండలం చీనేపల్లికి చెందిన రామచంద్ర 40 రాయల్ ప్యాలెస్ విస్కీ బాటిళ్లను అక్రమంగా తీసుకొని వెళ్తుండగా గమనించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి 40 రాయల్ ప్యాలెస్ విస్కీ బాటిల్ స్వాధీనం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినటుల చెప్పారు. ఈ దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

## వివాహిత ఆత్మహత్య

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కస్తూరాజుగారిపల్లి కస్పాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కస్తూరాజుగారిపల్లికి చెందిన ప్రసాద్‌తో ఒంటేరు లక్ష్మీదేవి అలియాస్ మాధవికి 2011వ సంవత్సరం వివాహం జరిగిందని తెలిపారు. వీరికి ముగ్గురు సంతానం కలిగారని చెప్పారు. నిత్యము అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించేవాడని భర్త వేధింపులు భరించలేక లక్ష్మీదేవి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి సోదరుడు రవిశంకర్ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

## వివాహం చేయలేదని యువకుడి..

**లక్కిరెడ్డిపల్లి :** వివాహం చేయలేదని మనస్తాపనతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణ ఎర్రగుడి కాపుపల్లిలో జరిగింది. ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు బ్రాహ్మణగుడి కాపుపల్లికి చెందిన దేరంగుల మహేష్(22) వివాహం చేయమని తల్లిదండ్రులతో గొడవ పడేవాడని చెప్పారు. తల్లిదండ్రులు తన సోదరుడు మహేష్‌కు వివాహం అయిన తర్వాత చేస్తామని సర్ది చెప్పే వారని అన్నారు. తల్లిదండ్రుల వివాహం చేయలేదని మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.